www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 12 అక్టోబర్ 2025
5
కాకినాడ



జిఒ రద్దు సాధనపై యానిమేటర్లకు అభినందన

ప్రజాశక్తి-కాకినాడ

విఒఎ యానిమేటర్ల మూడేళ్ల కాల పరిమితి జిఒను రద్దుకై పోరాడిన యానిమేటర్లను సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి అభినందించారు. యానిమేటర్లు మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకోగానే తొలగించి ఆ స్థానంలో మరొకరు నియమించే అన్యాయమైన ఆదేశాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు, స్థానిక రాజకీయ నాయకులు ఈ ఆదేశాలను అడ్డం పెట్టుకుని యానిమేటర్లతో ఇప్పటివరకు గొడ్డు చాకిరీ చేయించుకుని కనీస మర్యాద కూడా ఇవ్వకుండా ఇష్టానుసారం తొలగింపులకు పాల్పడ్డారన్నారు. 15 ఏళ్ల అధికారంలో ఉన్న ప్రభుత్వాలన్నీ ఇలాగే వ్యవహరించాయన్నారు. కనీస వేతనం రూ.26 వేలు, ప్రభుత్వ 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తింపు, పొదుపు సంఘాల పని కాక ఇతర పనులు చేయించకూడదనే డిమాండ్లపై పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

నిలిచిన వైద్యసేవతో అవస్థలు

- జిల్లాలో 36 నెట్‌వర్క్ ఆస్పత్రులు
- భారీగా పేరుకున్న బకాయిలు
- రూ.115 కోట్లపైనే బిల్లులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. మూడు రోజుల నుంచి పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందడం లేదు. ఇందుకు కూటమి ప్రభుత్వమే కారణంగా పలువురు రోగులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ఎత్తున ప్రయివేటు ఆసుపత్రులకు బకాయిలు పెండింగ్‌లో ఉంచడంతో నెట్వర్క్ ఆసుపత్రులు వైద్య సేవలను నిలిపివేశాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో రోగులు అల్లాడిపోతున్నారు. తమ ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు నెట్వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు హాస్పిటల్ ఆవరణలో నోటీసు బోర్డులను, ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దీంతో రోగులు నిరాశతో వెనుతిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎన్టీఆర్ వైద్య సేవలను తిరిగి ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరుతున్నారు.

జిల్లాలో 36 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవ పేరుతో ఆరోగ్యశ్రీ సేవలు అందుతున్నాయి. గత ఏడాదికాలంగా రూ.115 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని యాజమాన్యాలు చెబుతున్నా అనేకసార్లు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. సిబ్బంది వేతనాలు, ఇతర నిర్వహణ ఖర్చులు భరించలేక నెట్వర్క్ హాస్పిటల్స్ తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో విధి లేని పరిస్థితుల్లో సేవలను నిలిపివేయాల్సి వచ్చిందని యాజమాన్యాలు చెబుతున్నాయి.

రోగులకు తప్పని అవస్థలు

జిల్లాలో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సేవలు ఒక్కసారిగా నిలిచిపోవడంతో జిల్లావ్యాప్తంగా పలు రకాల క్షతగాత్రులు, రోగులు శస్త్ర చికిత్సలు చేయించుకునేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏ ఆసుపత్రికి వెళ్లినా శుక్రవారం ఉదయం నుంచి ఎలాంటి కేసులూ అనుమతించక పోవడంతో రోగులు అవస్థలు పడ్డారు. ఏదైనా అనారోగ్యం చేసి లేదా అత్యవసర చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రికి వెళుతుంటే అక్కడ ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయని సిబ్బంది చెబుతూ ఉండడంతో రోగులు తీవ్ర సహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రైవేట్ నెట్వర్క్ ఆస్పత్రుల్లో సగటున రోజుకు సుమారు 100 మంది రోగులు ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్సల కోసం ఆధార పడుతున్నారు. ఈ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసి బీమా పథకంగా మార్పులు చేయించి తద్వారా ప్రైవేట్ వ్యక్తులకు వైద్యాన్ని అందించేలా ప్రభుత్వం చర్యలకు దిగుతోందని తెలుస్తోంది. దీనిపై రోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నెట్వర్క్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ సిబ్బందికి సూచనలు ఇస్తున్న అధికారులు



తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము

ప్రభుత్వం ప్రకటించిన ఎన్టీఆర్ వైద్య సేవల బిల్లుల చెల్లింపుల ఆలస్యం వల్ల అనేక ప్రైవేట్ హాస్పిటల్స్ తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండడం వల్ల రోగులకు అందించే సేవల నాణ్యతపైనా ప్రభావం పడుతోంది. బిల్లు పెండింగ్ వల్ల స్టాఫ్, రోజువారీ వైద్య సేవలపై తీవ్రమైన ఒత్తిడి ఏర్పడింది. అయినప్పటికీ రోగుల సేవలను ఆపకుండా కొనసాగించాం. ఎందుకంటే అది మా వృత్తి ధర్మం.

- డాక్టర్ రామకృష్ణ , డైరెక్టర్, ట్రస్ట్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్, కాకినాడ



ప్రభుత్వం స్పందించాలి

ప్రభుత్వం తక్షణమే స్పందించి, పెండింగ్ బిల్లుల విడుదలకు టైమ్‌లైన్ ఇవ్వాలి. భవిష్యత్‌లో పథకం చెల్లింపులను సకాలంలో చేయడం ద్వారా ఈ సంక్షోభానికి పరిష్కారం చూపాలి. ప్రజలకు వైద్యం అందించేది కూడా మేమే. ఆ బాధ్యతను నిలబెట్టుకోవడానికి ప్రభుత్వం సహకరించాలని కోరుకుంటున్నాం.

- డాక్టర్ వాడ్రేవు రవి, సాయి సుధా హాస్పిటల్స్, ఎపి స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ జిల్లా కో ఆర్డినేటర్.



నిర్వహణ కష్టం ఉంది

ప్రైవేట్ హాస్పిటల్స్ ప్రభుత్వానికి భాగస్వాములు మాత్రమే. ప్రత్యర్థులు కాదు. ఈ విధంగా చెల్లింపులు నిలిపివేయడం, అనుమతులు ఆలస్యం చేయడం వల్ల ఆసుపత్రుల నిర్వహణ కష్టతరం అవుతోంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించాలి.

- డాక్టర్ వై.కళ్యాణ చక్రవర్తి, ట్రస్ట్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు.

పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలి

వైద్య ఉద్యోగుల సంఘం నేత రతన్‌రాజ్

ప్రజాశక్తి - కాకినాడ

పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని ఐక్య వైద్యారోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.రతన్‌రాజ్ డిమాండ్ చేశారు. శనివారం కాకినాడలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు రెండేళ్లయినా నేటికీ ఉద్యోగులకు ఆర్థిక బకాయిలను చెల్లించలేదన్నారు. కూటమి అధికారంలోకి వస్తే తమ సమస్యలు తీరుతాయని ఉద్యోగులు ఎంతగానో ఎదురు చూశారన్నారు. ఉద్యోగుల ఆశలపై ప్రభుత్వం నీళ్లు జల్లుతుందన్నారు. ఇప్పటికీ ఐదు డిఎలు, నాలుగు సరెండర్ లీవులు, ఐఆర్, పిఆర్‌సి వంటివి చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టిందన్నారు. ఎన్నికల సమయంలో సిపిఎస్‌ను రద్దు చేస్తానని పవన్‌కళ్యాణ్ తెలిపారన్నారు. కాని నేటికీ అది అమలు కాలేదన్నారు. గత సర్కారు కంటే కూటమి సర్కారు తీరు మరింత దారుణంగా ఉందన్నారు. ఈ నెల 10న జరిగిన రాష్ట్ర కేబినెట్‌లో కూడా ఉద్యోగులకు అనుకూలంగా ఎలాంటి నిర్ణయం చేయలేదన్నారు. ఉద్యోగులను కూటమి సర్కారు అసలు గుర్తించట్లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం, డిమాండ్ల సాధన కోసం ఉద్యోగులు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవట్లేదన్నారు. పిహెచ్‌సి వైద్యులు రెండు వారాలుగా సమ్మెలో ఉన్నా స్పందించిన దాఖలాలు లేవన్నారు. వైద్యుల సమ్మెతో వైద్యారోగ్య శాఖ ఉద్యోగుల సప్లిమెంట్రీ బిల్లులు అవ్వలేదన్నారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యంగా కనిపిస్తోందన్నారు. ప్రభుత్వంలో ఉద్యోగుల పాత్రను పాలకులు విస్మరిస్తున్నారన్నారు. ప్రభుత్వ తీరు వల్ల భవిష్యత్తులో ఉద్యమానికి దిగాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రతన్‌రాజ్

బాలికా విద్య అత్యంత శక్తివంతమైన సాధనం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

అడబాల ట్రస్ట్ ఆధ్వర్యాన అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా కాకినాడ ఐడిఎ ఆధ్వర్యంలో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ జానకిరమ దంపతులు బాలికలకు పుస్తకాలు అందచేశారు. ఐడిఎ కాకినాడ కార్యదర్శి డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ బాలికా విద్య అనేది అత్యంత శక్తివంతమైన సాధనాల్లో ఒకటి అన్నారు. ఏటా అక్టోబర్ 11న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం జరుపుకుంటారన్నారు. ప్రపంచవ్యాప్తంగా బాలికల హక్కులను గుర్తించడం ప్రోత్సహించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం అని చెప్పారు. ఆడపిల్లలు ఎదుర్కొంటున్న వివక్ష, హింస, బాల్య వివాహాలు, ఇతర సవాళ్ల గురించి ప్రజలలో అవగాహన కల్పించడం, విద్య, పోషణ, వైద్య సంరక్షణ, చట్టపరమైన హక్కుల విషయాల్లో బాలికలకు సమాన అవకాశాలను కల్పించడం, బాలికలు వారి సామర్థ్యాన్ని పూర్తిగా గ్రహించి, తమ జీవితాలపై, ప్రపంచంపై ప్రభావం చూపడానికి వారికి అధికారం ఇవ్వడం జరిగేలా చూడాలని కోరారు. అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ బాలికలు విద్యను పొందినప్పుడు, వారి దేశాలు మరింత బలపడి అభివృద్ధి చెందుతాయని అన్నారు. నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్ నాయుడు, కృష్ణమోహన్ మహిళలు పాల్గొన్నారు.


పుస్తకాలు అందజేస్తున్న సభ్యులు

మద్యాన్ని ఆదాయ వనరుగా చూడరాదు

ప్రజాశక్తి-పిఠాపురం

ప్రభుత్వాలు మద్యం అమ్మకాలను ఆదాయ వనరుగా చూడరాదని మద్యం మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార కమిటీ కన్వీనర్ డాక్టర్ ఎన్.సూర్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాలక, ప్రతిపక్షాలు కేవలం మద్యాన్ని ఒక ఆదాయ వనరుగా మాత్రమే చూస్తున్నాయని విమర్శించారు. దీనివల్ల కల్తీ మద్యం విక్రయాలు సాగుతున్నాయని విమర్శించారు. కల్తీ మద్యం సేవించి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పు తెచ్చే మద్యాన్ని విక్రయించడం రాజ్యాంగ విరుద్ధం అన్నారు. సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తే రాష్ట్ర సంక్షేమం మెరుగు పడుతుందన్నారు.


నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

వ్యాధిగ్రస్తులకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

స్థానిక రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో కోరమండల్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వ్యాధిగ్రస్తులకు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షురాలు గౌరి మాట్లాడుతూ ప్రతిఫలాపేక్ష లేకుండా పరులకు ఇవ్వడమే దానమని, మన భారతీయ సంస్కృతిలో దానగుణానికి ఉత్తమ స్థానం ఉందని అన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం వారి అవసరాలు తీర్చడం కనీస మానవ ధర్మం అన్నారు. ఆధ్యాత్మికవేత్త డాక్టర్ శిరీష మాట్లాడుతూ సమాజానికి ఏదైనా సేవ చేయాలనే సంకల్పంతో కోరమండల్ మహిళ సంఘ సభ్యులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం అంతర్జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకుని బాలికలకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మల్లీశ్వరి, కోశాధికారి శ్రీదేవి, సభ్యురాలు మాధవి, మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్, జి.కృష్ణమోహన్, శ్రీవాణి, రేలంగి బాపిరాజు పాల్గొన్నారు.

పేదల వైద్యంపై ప్రభుత్వం కుట్ర : వైసిపి

ప్రజాశక్తి-పిఠాపురం

పేదలకు అందే వైద్యంపై కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని మాజీ ఎంపీ, వైసిపి నియోజకవర్గ ఇన్చార్జ్ వంగా గీతా అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో నాయకులు కార్యకర్తలతో కలిసి వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువచ్చి పేదలకు అందని ద్రాక్షగా ఉన్న కార్పొరేట్ వైద్యాన్ని అందించారన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గత ప్రభుత్వంలో వైద్యానికి పెద్దపీట వేశారన్నారు. పేద విద్యార్థులకు డాక్టర్ చదువును దగ్గర చేసేందుకు 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను తీసుకువచ్చి నిర్మాణాలు చేపట్టారని, ఐదు కాలేజీలను పూర్తి చేసి క్లాసులు ప్రారంభించారని తెలిపారు. నిర్మాణ దశలో ఉన్న మిగిలిన కాలేజీలపై ఇప్పటికి కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తూ... ప్రయివేటు పరం చేసి కార్పొరేట్ శక్తులకు కట్టపెట్టేందుకు కంకణం కట్టుకోవడం సిగ్గుచేటన్నారు. పేదలకు మంచి చేసే ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆధ్వర్యంలో వైసిపి దశలవారీ పోరాటాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు

రూ.10 కోట్లతో రోడ్లు, డ్రైయినేజీల అభివృద్ధి

ప్రజాశక్తి - సామర్లకోట

మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగా సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలో రూ.10 కోట్లతో రోడ్లు, డ్రెయినేజీలు అభివృద్ధి చేయనున్నట్లు పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. సామర్లకోట పట్టణ పరిధి 28వ వార్డులో నూతన రోడ్ల నిర్మాణ పనులకు పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చినరాజప్ప మాట్లాడుతూ సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలో రూ.10 కోట్ల నిధులతో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించబోతున్నామని తెలిపారు. ప్రజా సౌకర్యాల అభివృద్ధి దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, భీమేశ్వర ఆలయం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కంటే జగదీష్ మోహన్(బాబు), కూటమి నాయకులు సరోజ వాసు, నూనె రామారావు, అడబాల కుమారస్వామి, బలుసు వాసు, గొల్తి సత్యనారాయణ, బొందల రామలక్ష్మి, సొసైటీ చైర్మన్ పైన్ని శీనివాసరావు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

పేదల వైద్యానికి ప్రభుత్వం బ్రేకులు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

వైద్యం చేయలేమని ఆస్పత్రుల ఎదుట బోర్డులు పెట్టే దుస్థితి కూటమి ప్రభుత్వ నిర్వాకం వల్ల రాష్ట్రంలో ఏర్పడిందని వైసిపి మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ నిధులను ప్రభుత్వం ఇవ్వకపోవడంతో పేద మధ్య తరగతి ప్రజలు కార్పోరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్న నెట్వర్క్ ఆస్పత్రుల ఎదుట వైద్యం చేయలేమని బోర్డులు ఏర్పాటు చేయడం చూస్తే చంద్రబాబు ప్రభుత్వం దివాళాకోరుతనం స్పష్టం అవుతోందన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను బీమా విధానంలో అమలు చేస్తామని కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నేడు పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా చర్యలకు ఉపక్రమించడం దారుణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 300 పైగా ఆస్పత్రుల్లో ఇప్పటికే ఉచిత వైద్య సేవలకు అంతరాయం ఏర్పడిందని, రూ.3 వేల కోట్లకు పైగా ప్రభుత్వం బకాయిలు పెట్టడమే కారణం అన్నారు. 2014-19 మధ్య ఆరోగ్యశ్రీని నిర్లక్ష్యం చేసిన చంద్రబాబు ప్రభుత్వం దిగిపోయేనాటికి రూ.700 కోట్లు బకాయి పెట్టిన విషయం గుర్తు చేసారు


దేవి | జాహ్నవి | జోష్ణవి | లాస్య | మణికంఠ | నిహాల్
యక్షిత | వైష్ణవి | తులసి | సుదీప్ | సుభానీషా | పావని

జిల్లా స్థాయి పోటీలకు 'ప్రతిభ' విద్యార్థులు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట పట్టణం ప్రతిభ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలలో విశేష ప్రతిభను ప్రదర్శించారు. ఈ నెల 9, 10వ తేదీల్లో సామర్లకోట గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీల్లో పలు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి, జిల్లా స్థాయికి ఎంపికైనట్టు విద్యాసంస్థల అధినేత ఎస్‌విజి ప్రకాష్ చెప్పారు. అక్టోబర్ 9న జరిగిన చెస్ అండర్-14 విభాగంలో 8వ తరగతి విద్యార్థులు ఎన్ఎల్ఎన్ నిహాల్ ప్రథమ స్థానం, ఎ.తేజ్ సుదీప్ ద్వితీయ స్థానం సాధించారు. ఖో ఖో అండర్-19 విభాగంలో 9వ తరగతి విద్యార్థి ఐ.మణికంఠ ప్రథమ స్థానం పొందాడు. అక్టోబర్ 10న జరిగిన చెస్ అండర్-14 బాలికల విభాగంలో 9వ తరగతి విద్యార్థిని మట్టపల్లి దేవీ జాహ్నవి ప్రథమ స్థానం, 6వ తరగతి విద్యార్థిని సానా సుభాని షా ద్వితీయ స్థానం సాధించారు. వాలీబాల్ అండర్-14 విభాగంలో 7వ తరగతి విద్యార్థినులు డి.దేవి, కె.పావని, కె.శ్రావణ జ్యోష్ణవి, 9వ తరగతి విద్యార్థిని వి.అనుదేవి యక్షిత జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వాలీబాల్ అండర్-17 విభాగంలో 9వ తరగతి విద్యార్థిని కె.సాయి లక్ష్మీ తులసి, ఖో ఖో అండర్-14 విభాగంలో 7వ తరగతి విద్యార్థినులు ఎస్.అమత వైష్ణవి, కె.లలిత లాస్య ఎంపికయ్యారు.


తనిఖీలు నిర్వహిస్తున్న తహశీల్దారు చంద్రశేఖర్ రెడ్డి, సిఐ కృష్ణభగవాన్

బాణసంచా కేంద్రాల్లో విస్తృత నిఖీలు

ప్రజాశక్తి-సామర్లకోట, పెద్దాపురం

పెద్దాపురం నియోజకవర్గంలో బాణసంచా పరిశ్రమలో ప్రభుత్వ నిభంధనలు పాటించాలని తహశీల్దార్లు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట లక్ష్మి ఆదేశించారు. శనివారం సామర్లకోట, పెద్దాపురం పట్టణం, మండలాల్లో వేట్లపాలెం, హుస్సేన్‌పురం, జి.మేడపాడు, పెద బ్రహ్మదేవం గ్రామాల్లోని బాణసంచా తయారీ కేంద్రాలను రెవెన్యూ, ఫైర్, పోలీసు డిపార్ట్మెంట్ల అధికారుల బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా తహశీల్దారు చంద్రశేఖర్ రెడ్డి తయారీ కేంద్రాల యజమానులతో మాట్లాడారు. పరిశ్రమలో పని చేసే కార్మికులకు బీమాను తప్పనిసరిగా చెల్లించాలన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కేంద్రల వద్ద భద్రతా ఏర్పాట్లను, అనుమతి పత్రాలను వారు పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో సామర్లకోట సిఐ ఎ.కృష్ణభగవాన్, అగ్నిమాపక సహాయ డైరెక్టర్ శ్రీహరి జగన్నాథం, ఎస్ఐ మౌనిక రెవెన్యూ, అగ్ని మాపక శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని బలపర్చుకోవాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - జగ్గంపేట

ప్రజాస్వామ్యాన్ని బలపర్చు కోవాలని మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ పార్టీ సిడబ్ల్యుసి సభ్యుడు ఎంఎం.పల్లంరాజు పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ చేపట్టిన దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా శనివారం జగ్గంపేటలో ఓట్ చోర్ గద్దె చోడ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం ఎన్నికల కమిటీలో సుప్రీం కోర్టు జడ్జికి బదులు వారి కేంద్ర మంత్రిని నియమించుకునే విధంగా చట్టం చేసిందన్నారు. దీంతో ఎన్నికల కమిషనర్‌ను వారికి తొత్తుగా వ్యవహరించేవారిని నియమించుకున్నారని ఆరోపించారు. గతంలో జరిగిన ఎన్నికల్లో లక్షల ఓట్లను అదనంగా చేర్చిందనే విషయాన్ని రాహుల్ గాంధీ ఆధారాలతో రుజువు చేశారన్నారు. ఐనా ఎన్నికల కమిషన్ పట్టించుకోకపోవడంతో ఆ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో దేశవ్యాప్తంగా సంతకాల సేకరణ చేపట్టినట్టు తెలిపారు. 3 కోట్ల మంది సంతకాలు సేకరించే ప్రజలు భాగస్వామ్యులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిసిసి జిల్లా సెక్రటరీ మల్లిపూడి రాంబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు, మొయ్యేటి సూర్యప్రకాశ్, మరోతి శివ గణేష్, మొగిలి సురేష్, ఎస్‌విఎస్.బాబు పాల్గొన్నారు.


సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నేత పల్లంరాజు

బాధిత కుటుంబానికి ఫారెస్ట్ అధికారుల సాయం

ప్రజాశక్తి- తాళ్లరేవు

చొల్లంగిపేట శ్రీమురళీకృష్ణ ఇడిసి వైస్ చైర్మన్ కె.విజయదుర్గ ఇటీవల మరణించడంతో ఆమె కుటుంబానికి ఫారెస్ట్ అధికారులు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ఎస్ఆర్.వరప్రసాద్ ఆదేశానుసారం సెక్షన్ ఆఫీసర్ ఎస్.వీరభద్రరావు, ఎఫ్‌బిఒ పి.సంధ్యారాణి, సిబ్బంది వి.విష్ణు ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సంధర్భంగా ఇడిసి చైర్మన్ ఎం.సత్యనారాయణ, ఎఫ్ఎస్ఒ వీరభద్రరావుతో కలిసి వారు ఈ సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


సాయం అందిస్తున్న ఫారెస్ట్ అధికారులు

వికలాంగులపై చిన్నచూపు తగదు

ప్రజాశక్తి- తాళ్లరేవు

మానసిక వికలాంగుల తల్లిదండ్రులు ఆత్మస్థయిర్యంతో ఉండాలని, వికలాంగులపై సమాజం చిన్నచూపు తగదని న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధి, న్యాయవాది వై.వసంత అన్నారు. ధీరుబాయి అంబానీ ఎర్లీ ఇంటర్వెన్షన్ కేంద్రంలో ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడారు. వికలాంగుల తల్లిదండ్రులకు సమాజం నుంచి అనేక ప్రతిబంధకాలు ఎదురవుతాయని వాటిని ఆత్మస్థైర్యంతో ఎదుర్కొని చిన్నారులను ఓర్పుతో సాకాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్రం ఇన్‌ఛార్జి ఎంజె.గోపాల్, న్యాయవాది రాజశేఖర్, ఫిజియోథెరపిస్ట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా గోతులు పూడ్చివేత

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

సేవా కార్యక్రమాల్లో భాగంగా మన ఊరు మన బాధ్యత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇంద్రపాలెం బ్రిడ్జి మీద శనివారం గోతులను పూడ్చారు. అనుమతి లేకుండా తిరుగుతున్న భారీ వాహనాల వల్ల పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. ఈ గుంతల వల్ల కాకినాడ నుండి గొల్లలమామిడాడ వెళ్లే అనేక మంది వాహనదారులు కొన్ని నెలలుగా ప్రమాదాలకు గురవుతున్నారు. శనివారం సంస్థ ప్రతినిధులు, యువత, పెద్దలు ఇంద్రపాలెం వంతెన మీద పడిన సుమారు 12 పెద్ద గుంతలను కాంక్రీట్ వేసి పూడ్చారు. కొంత కాలంగా ఇంద్రపాలెం గ్రామ ప్రజలు కార్లు, లారీలు, ఆటోలు, మోటారు వాహనాలు ఇంద్రపాలెం మార్కెట్ దగ్గర బ్రిడ్జి మీద ఉన్న గోతుల వల్ల ప్రయాణం చెయ్యడానికి ఎంతో ఇబ్బంది పడుతున్నారు, ప్రమాదాలకు గురవుతున్నారు, ప్రజల కష్టాలను దృష్టిలో పెట్టుకుని మన ఊరు మన బాధ్యత స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఊరి కోసం సేవ కార్యక్రమాల్లో భాగంగా గోతులు పూడిక కార్యక్రమం నిర్వహించారు.

కార్టూ'నిజం'



పేదల జీవితాల్లో చీకట్లు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

సర్కారు అలసత్వం.. నిర్లక్ష్యం... పేదల జీవితాలను చీకట్లోకి దోసేస్తోంది. కూటమి పాలనలో ప్రజలకు భద్రతా, భరోసా రోజురోజుకూ కరువవుతున్నాయి. సమస్యలపై పలు రంగాల కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు రోడ్డెక్కుతున్నా దున్నపోతు మీద వానచందంగా సర్కారు వ్యవహరిస్తుంది. ఆపదలో ఉన్న కుటుంబాల పట్ల కనికరం లేకుండా వ్యవహరిస్తుంది. ఇటీవల రాయవరం మండలంలో జరిగిన భారీ అగ్నిప్రమాద ఘటనే దీనికి నిదర్శనంగా నిలుస్తోంది. రాయవరం మండలం కొమరిపాలెంలోని బాణసంచా తయారీకేంద్రంలో జరిగిన అగ్నిప్రమాదంలో 8 మంది మృత్యువాత పడ్డారు. మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలో ప్రభుత్వం, అధికారులు వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఘటన జరిగిన సమయంలో ఎంత మంది కూలీలు ఉన్నారనే విషయంపై ఇప్పటికీ స్పష్టత లేదు. నిబంధనల ప్రకారం ఎంత మంది పనిచేయాలి, ఈ యూనిట్‌లో ఎంత మంది పనిలో ఉన్నారనే విషయంపైనే అధికారులు ఎలాంటి ప్రకటనా చేయలేదు. అన్ని అనుమతులు ఉన్న యూనిట్‌లో ప్రమాదం జరిగడం, ఆ పరిసర ప్రాంతాల్లో ఇతర తయారీ కేంద్రాలకు అనుమతులు లేవని అధికారులు తప్పుడు లెక్కలు ఇవ్వడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణ కమిటీ రంగంలోకి దిగనుంది. సోమవారం కమిటీ దీనిపై విచారణకు వచ్చే అవకాశం ఉంది. ఈ ఘటనలో 8 మంది మృత్యువాత పడినా మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకూ ఎటువంటి భరోసా లభించలేదు. కనీసం నష్టపరిహారం కూడా ప్రకటించలేదు. ఈ ఘటన జరిగిన రోజు నుంచి మాత్రం ఆఘమేఘాలపై అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ అనుమతులు లేని, అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా సామగ్రిని మాత్రం పెద్ద ఎత్తున సీజ్ చేస్తున్నారు. ప్రమాదలు జరిగిన సమయంలో తప్ప ఇతర సందర్భాల్లో తనిఖీలు నిర్వహించిన దాఖలాలు బహుతక్కువ. ఈ సారి అధికారులు ఇదే పంథాలో సాగడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ పర్యటనకు ముందు రోజే జరిగిన ఈ ప్రమాదంపై కనీసం స్పందించకపోవడం విస్మయానికి గురిచేసింది. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను మంత్రి సుభాష్ మొక్కుబడిగా పరామర్శించి చేతులు దులుపుకున్నారనే అభిప్రాయం జిల్లా వాసులలో వ్యక్తమవుతోంది.

కూటమి వస్తే తమ జీవితాలు బాగుపడతాయి అనుకున్న మత్స్యకారుల ఆశ అడియాశలయ్యాయి. సమస్యలు పరిష్కరించాలని పిఠాపురం నియోజకవర్గంలో మత్స్యకారులు కొన్ని రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారు. ఎట్టకేలకు స్పందించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఇటీవల పిఠాపురం వచ్చారు. మత్స్యకారులతో సమావేశమయ్యారు. వెంటనే సమస్య పరిష్కారం అవుతుందని అందరూ ఆశించినా ఆయన పర్యటన వల్ల ఒనగూరిందేమీ లేదు. వచ్చి పాతపాటే పాడి మరో వంద రోజుల సమయం ఇస్తే సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. మత్స్యకారుల ఉపాధితో పాటు, పరిశ్రమలూ అవసరమేనంటూ తన వైఖరిని చెప్పకనే చెప్పారు. చివరకు స్పష్టమైన భరోసా ఇవ్వకపోగా పరిశ్రమల శాఖ మంత్రితో చర్చించాలి, మత్స్యశాఖ మంత్రితో మాట్లాడాలి, కమిటీ వేస్తాం, 100 రోజుల్లో తమ అభిప్రాయాన్ని వెల్లడిస్తామంటూ వచ్చిన దారినే వెనుతిరిగడం సర్వత్రా విమర్శలకు దారితీసింది. పిఠాపురంలోనే ఉంటానంటూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని గెలిచిన తొలి నెలలోనే బుట్టదాఖలు చేసిన సదరు ప్రజా ప్రతినిధి, తన నియోజక వర్గంలో ప్రజల సమస్యలు సైతం తన పరిధిలో లేవంటూ చెప్పిన తీరుతో ప్రజలు అవాక్కయ్యారు.

సిజెఐపై దాడితో మిన్నంటిన నిరసనలు

దేశ అత్యున్నత న్యాయమూర్తిపై జరిగిన దాడి ప్రస్తుత పాలనా వ్యవస్థ తీరును దర్పణం పట్టింది. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 11 ఏళ్లలో వినాశకర సామాజిక, ఆర్థిక, రాజకీయ విధానాలను అనుసరిస్తున్న విషయం విధితమే. ప్రజలందరూ తమ భావజాలాన్ని ఆమోదించాలని, ప్రశ్నించిన వారిపై దాడులు తప్పవంటూ తెగబడుతున్న విషయం విధితయే. సిజెఐపై దాడిని కెవిపిఎస్‌తో పాటూ పలు దళిత, ప్రజాసంఘాలు తీవ్రంగా ఖండించాయి. వివిధ రూపాల్లో నిరసనలు తెలిపాయి. న్యాయ వ్యవస్థలో అత్యున్నత స్థాయిలో ఉన్న వ్యక్తిపైనే ఇటువంటి ఘటనలు చోటు చేసుకోవడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

పనిగంటల పంపుపై కార్మికులు భగ్గు

పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం వంత పలకడంపై కార్మికులు, కార్మిక సంఘాలు భగ్గుమంటున్నాయి. తాజాగా 8 గంటల పనివిధానాన్ని 12 గంటలకు మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సంపద సృష్టించేది పారిశ్రామిక వేత్తలేనంటూ వక్రభాష్యం చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు కార్మికులపై పని భారం మోపడం ఎందుకనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి ఇటువంటి నిర్ణయాలను వెనక్కి తీసుకోకుంటే కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.



నేరాలు ఘోరాలు

మహిళపై గుర్తు తెలీని వ్యక్తి దాడి

ప్రజాశక్తి - పెరవలి

తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన బండారు పున్నమ్మపై గుర్తు తెలియని వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 9వ తేదీ రాత్రి 9.30 సమయంలో ఖండవల్లి పుంత రోడ్డు వద్ద ఆటో దిగి రోడ్డుపై నిలబడింది. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆమె వద్దకు వచ్చి కత్తితో దాడి చేశాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో అతడు పారిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - కడియం

స్థానిక పెద్ద చెరువు గట్టుపై శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెరువు గట్టుపై తుమ్మా కాంతమ్మ నివాసం ఉంటుంది. వంట గ్యాస్ లీక్ అవడంతో అకస్మాత్తుగా మంటలు చెలరేగి ఇల్లు కాలి బూడిద అయినట్లు తెలిపారు. స్థానికుల సమాచారంతో రాజమహేంద్రవరం అగ్నిమాపక వాహన సిబ్బంది కడియం చేరుకుని మంటలు పక్క గృహాలకు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరిజాల బాబు,ఉప సర్పంచ్ వెలుగుబంటి నాని ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

యానాంలో వ్యక్తి హత్య

ప్రజాశక్తి - యానాం

పాత కక్షల నేపథ్యంలో అతి కిరాతకంగా ఒక వ్యక్తిని పొడిచి చంపిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. గతంలో కాజులూరు మండలం సుబ్బారాయుడు వీధికి చెందిన త్రిపురశెట్టి నారాయణ స్వామి యానాం గోపాల్ నగర్‌లో మోకా వెంకటేశ్వరరావును ఇంటి వద్దే నరికి చంపాడు. ఆ కక్షతో వెంకటేశ్వరరావు కుమారుడు శనివారం రాత్రి యానాం పద్మా థియేటర్ సమీపంలో నారాయణస్వామి (33)ని హత్య చేసి పరారైనట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఎస్‌పి వరదరాజన్ ఆధ్వర్యంలో ఎస్ఐ పునీత్ రాజ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిడిఎస్ రైస్ వ్యాన్ పట్టివేత

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరం వద్ద పిడిఎస్ రైస్ వాహనాన్ని శనివారం తెల్లవారుజామున విజిలెన్స్ పోలీసులు పట్టుకున్నారు. పిఠాపురం నుండి జగ్గంపేట వైపు ప్రజా పంపిణి బియ్యం బస్తాలతో వెళ్తున్న వ్యాన్‌ను రామవరం వద్ద తనిఖీ చేసి పట్టుకున్నట్లు విజిలెన్స్ సిఐ టి.నాగవెంకటరాజు తెలిపారు. వ్యాన్‌లో సుమారు 4,059 కేజీల పిడిఎస్ రైస్ ఉందని, ఆ వ్యాన్‌ను సివిల్ సప్లైస్ అధికారి నాగబాబుకు అప్పగించినట్టు తెలిపారు. స్థానిక పోలీసులకు పిర్యాదు చేసి బియ్యం బస్తాలను రామవరం స్టాక్ పాయింట్‌కు అప్పగించినట్లు ఎంఎస్ఒ నాగబాబు తెలిపారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - పెరవలి

పేదలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం స్థానిక డిసిసిబి బ్రాంచ్ ఎదురుగా ఏర్పాటు చేసిన విష్ణు డెంటల్ క్లినిక్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన దంత వైద్యాన్ని అందించేందుకు విష్ణు దంత వైద్య కళాశాల పలు ప్రాంతాలలో అత్యాధునిక వసతులతో ఆసుపత్రులను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఎంఎల్‌సి వంక రవీంద్రనాథ్, గ్రామ సర్పంచ్ గంగోలు సీతమ్మ, ఖండవల్లి సర్పంచ్ పులిదిండి నాగరాజు, కానూరు సర్పంచ్ భావన మధుపూర్ణచంద్ వివిధ విభాగాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినయ్, డాక్టర్ ఆర్‌వి.రాజు, డాక్టర్ కార్తీక్ వర్మ, డాక్టర్ రమేష్, డాక్టర్ చైతన్య, రవి కుమార్, రాఘవ రాజు, అశోక్ వైద్య సిబ్బం ది, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బార్ తొలగించాలని నిరసన

ప్రజాశక్తి - నిడదవోలు

నివాస ప్రాంతాల మధ్యలో ఉన్న చైతన్య బార్ అండ్ రెస్టారెంట్‌ను తొలగించాలంటూ చేపట్టిన నిరసన శనివారం నాటికి 19వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయ కులు మాట్లాడుతూ జనవాసాల మధ్య ఏర్పాటు చేసిన బార్‌ను రద్దు చేయాలని పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళన నిర్వహిస్తున్న అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి రెండు వారాలు గడిచినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో దయామణి, పమ్మి రామలక్ష్మి, జువ్వల రాంబాబు, బైపే రాజేశ్వరరావు, ఈమని గ్రీష్మకుమార్, విజయ్‌సారధి, తాడేపల్లి రవి, బైపే ప్రసాద్, కోడి సుజ్ఞాన్‌రాజు, అంబటి పుల్లారావు, కె.జార్జి, వై పైడయ్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని ఎస్‌కెవిటి కళాశాలలో జరుగుతున్న ఎపి స్కూల్ గేమ్స్ శనివారం ఉత్సాహంగా జరిగాయి. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు ఈ క్రీడల్లో పాల్గొన్నారు. ఈ పోటీలను డిఇఒ కంది వాసుదేవరావు పరిశీలించారు. ఉషు పోటీలు ఉదయం 11 గంటల డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగాయి. సెమీ ఫైనల్ పోటీ ముగిసింది. ఆదివారం ఫైనల్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. అంతర్ జిల్లాల పోటీలో విజేతలుగా నిలిచిన వారందరూ ఎపి జట్టులో జాతీయ స్థాయి పోటీలకు పంపించడం జరుగుతుంది.

ఘనంగా బాలికా దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం

రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఉన్న ఎస్‌టి పోస్ట్‌మెట్రిక్ గర్ల్స్ హై స్కూల్‌లో అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలిక ఒక కుటుంబానికి వెలుగు, ఒక తరం అభివృద్ధికి పునాది అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో సత్యకుమార్ నల్లూరి, కంబాలపేట వైద్యాధికారి డాక్టర్ ఎం.అనూహ్య, హాస్టల్ వార్డెన్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ షమ్మీకుమార్, సుధీర్, సిసి రాజు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఆర్ట్స్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి పాల్గొని బాలికల ఆరోగ్యం, అంశాలపై అవగాహన కల్పించారు.

జెఎన్‌టియుకెలో శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై మూడు రోజుల శిక్షణా శిబిరం శనివారం ప్రారంభమైంది. ఈ నెల 13వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుంది. ఈ కార్యక్రమాన్ని విశిష్ట ఇన్నోవేటర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఐఇఇఇ స్టూడెంట్ బ్రాంచ్, ఇసిఇ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఇసిఇ హెచ్ఒడి డాక్టర్ బి.లీలాకుమారి, కన్వీనర్‌గా, ఇసిఇ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పుష్పలత కో ఆర్డినేటర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అకడమిక్స్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జివిఎస్ఆర్.దీక్షితులు హాజరై శిక్షణా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో మొత్తం 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

రామవరంలో అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరం శ్రీ సత్తమ్మతల్లి ఆలయం వద్ద శనివారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ పాల్గొని బాటసారులకు ఆహారం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి దొడ్డ శ్రీను, పార్టీ జిల్లా సమయుక్త కార్యదర్శి సూరంపాలెం బాలు, పార్టీ నాయకులు మండపాక పాపన్న దొర, మాదారపు వీరబాబు, మెహర్ బాబా, పిల్లి శ్రీను పాల్గొన్నారు.

గంగాస్వామి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలోని ఉప్పలపాడులో మేడిబోయిన నూకరాజు అనంతలక్ష్మి కుమారుడు గంగాస్వామి విగ్రహావిష్కరణ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 42 బెటాలియన్ కమాండెంట్ ధర్మ ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఆర్‌పిఎఫ్ 219 బెటాలియన్‌కు చెందిన గంగాస్వామి 2016లో రోడ్డు ప్రమాదంలో మరణించారన్నారు. గంగాస్వామి తల్లిదండ్రులు, గ్రామస్తులు, మిత్ర బృందం సహకారంతో ఉప్పలపాడు గ్రామపంచాయతీ వద్ద ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. గంగాస్వామి జయంతి సందర్భంగా ఆయన తల్లిదండ్రులు ఆయన విద్యనభ్యసించిన పాఠశాలకు మెరిట్ విద్యార్థుల ప్రోత్సాహం నిమిత్తం రూ.10 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్తి సోమరాజు, గంగ స్వామి సహచరులు, డిప్యూటీ కమాండెంట్ దీపక్ కుమార్, డాక్టర్ నితిన్ ఝాల్డి, ఎస్ఐ సి.వెంకన్న, నరం శివ గణేష్, పిల్లి ప్రభాకర్, బొమ్మన రాజేశ్వరరావు, తోరాటి వెంకన్న, తమటం నాగేశ్వరరావు, సిరిదెళ్ల వీరన్న, సత్తి కృష్ణమూర్తి, కంటిపూడి సత్యనారాయణ, చావ సూరిబాబు, చావ నరసింహమూర్తి, సాదే నరేంద్ర, నూకతట్టు వెంకటరమణ పాల్గొన్నారు.

లాండ్రీ సర్వీస్‌ను ప్రారంభించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక గోకవరం రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జికె.లాండ్రీ సర్వీసెస్, డ్రై వాష్ సెంటర్‌ను ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ, టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ శనివారం ప్రారంభించారు. లాండ్రీ సర్వీసెస్ అధినేత గంజేటి మూలాస్వామి మాట్లాడుతూ ఈ పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఖరీదైన వస్త్రాలను లాండ్రీ, డ్రైవాష్ క్లీనింగ్ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అత్తులూరి నాగబాబు, రాజపూడి సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి బుల్లెబ్బు, టిడిపి నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, జీను మణిబాబు, ముండ్రు ఎర్రబాబు, సర్వసిద్ధి లక్ష్మణరావు, పాండ్రంగి రాంబాబు, బచ్చుల నాగరత్నం సుధీర్, రేఖ బుల్లి రాజు, తొట్టిపూడి నాగేశ్వరరావు, బద్ది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం చైర్మన్‌గా చిక్కాల

ప్రజాశక్తి ఏలేశ్వరం

లింగంపర్తి సీతారామ స్వామి దేవస్థానం చైర్మన్‌గా చిక్కాల లక్ష్మణరావు నియమితులయ్యారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే లింగంపర్తి దేవస్థానం చైర్మన్ పదవికి ఎంతోమంది పోటీ పడగా లక్ష్మణరావుకు ప్రత్తిపాడు ఎంఎల్ఎ సత్యప్రభ, కూటమి నాయకుల ఆశీస్సులతో లభించింది. వైస్ చైర్‌పర్సన్‌గా పెంటకోట పద్మారాణి, డైరెక్టర్లుగా కోట జానికి, కీలు సత్యవేణి, బుగతా సుగుణ, పితాని మాధురి, మద్దిల రాజేష్, ఉడతల రమణారావు నియమితులయ్యారు.

వల్లభ స్వామి ఆలయంలో యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో శృంగారవల్లభ స్వామి దేవస్థానంలో శనివారం యాత్రికుల రద్దీ అధికంగా నమోదైంది. సుమారు 20 వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక దర్శనం, విరాళాలు, తులాభారం, లడ్డూ ప్రసాదం ద్వారా ఆలయానికి మొత్తం రూ.3,02,691 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. సుమారు 4,000 మంది అన్నదానంలో పాల్గొన్నారు. కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, పాల్గొన్నారు.

ఘనంగా పాస్టర్ల దినోత్సవం

ప్రజాశక్తి - సామర్లకోట

అంతర్జాతీయ పాస్టర్స్ డేను పురస్కరించుకుని సామర్లకోట ఆంధ్ర జూబ్లీ బాప్టిస్ట్ సంఘంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఫీల్డ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆంధ్ర జూబ్లీ బాప్టిస్ట్ సంఘ కార్యవర్గం పాస్టర్ బివి.రాజు, సంఘ అధ్యక్ష కార్యదర్శులు బిఎస్.వందనం, టి.సూర్యారావు, ఐఇ జీవన్ కుమార్, పిట్టా సత్యనారాయణ, వి.జాన్, ఎంఎ.జేమ్స్, ఆర్.లాజర్స్ పాల్గొన్నారు.

13న పాడా కార్యాలయంలో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని పాడా కార్యాలయంలో ఈ నెల 13న ప్రజా ఫిర్యాదుల పరిష్కార (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పాడా పిడీ వేణుగోపాలరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి 01:00 గంటల వరకూ నిర్వహిస్తామని, ఈ కార్యక్రమానికి రాలేని అర్జీదారులు వారి అర్జీలను Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చునని, అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

స్నేహితుల పిల్లల చదువుకు సాయం

ప్రజాశక్తి -కరప

కరప హైస్కూల్ 1999-2000 బ్యాచ్ విద్యార్థులు ఇద్దరు స్నేహితుల పిల్లల చదువులు నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. ఇద్దరు స్నేహితుల పిల్లలు ప్రస్తుతం విద్యాభ్యాసంలో కొనసాగుతున్నారు. వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న బ్యాచ్ స్నేహితులు, చదువు అంతరాయం కలగకుండా ఉండేందుకు సహాయ హస్తం అందించారు. రూ.20 వేల చొప్పున, మొత్తం రూ.40 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సహాయాన్ని బ్యాచ్‌లోని సభ్యులు స్వయంగా సమకూర్చి, పిల్లల చదువుకు ఉపయోగించుకునేలా వారి కుటుంబ సభ్యులకు అందించారు. పూర్వ విద్యార్థులు పేపకాయల మాచరరావు, మేడిశెట్టి సత్య స్వరూప్, భోగిరెడ్డి గోపీకృష్ణ, అడపా శ్రీనివాస్, మోర్త వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరి వృత్తిదారులకు సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్రంలోని కుమ్మరి శాలివాహన చేతివృత్తిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేసేందుకు సాయ శక్తులా కృషి చేస్తామని ఎపి కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ప్రేరేపి ఈశ్వర్ చెప్పారు. కాకినాడ జిల్లా పర్యటనకు తొలిసారిగా శనివారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహానికి వచ్చిన ఆయనకు కార్పొరేషన్ డైరెక్టర్ బీమావత్తుల సత్యనారాయణ, పసలపూడి ప్రసాద్ రావు, దాలిపర్తి శ్రీనివాసరావు ఘన స్వాగతం పలికారు. అనంతరం బోట్ క్లబ్ వద్ద గల కవయిత్రి మొల్లమాంబ విగ్రహానికి ఈశ్వర్ పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులవృత్తిపై ఆధారపడి జీవించే వారికి వృత్తి పనిముట్లు, పరికరాల అందజేతకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డి.ప్రకాశరావు, విశ్వనాథం, దుర్గాప్రసాద్, న్యాయవాది చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎపిఆర్ఎస్ఎ డివిజన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ఎపిఆర్ఎస్ఎ అమలాపురం డివిజన్ కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. డివిజన్ ప్రెసిడెంట్ గా అమలాపురం తహశీల్దార్ పి.అశోక్ ప్రసాద్ ఎన్నికయ్యారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మామిడి కుదురు తహశీల్దారు పి.సునీల్ కుమార్, వైస్ ప్రెసిడెంట్లుగా ఎంఆర్ఐలు పి.వేణుగోపాలరావు (మామిడికుదురు), వి.వెంకటరామరాజు (సఖినేటిపల్లి), ఆర్ఎస్‌డిటి జి.లలిత (ఉప్పలగుప్తం) ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శిగా కాట్రేనికోన డిటి వి.రవికిరణ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వాసా శామ్యూల్ దివాకర్, డిప్యూటీ తహశీల్దార్ డి.శ్రీనివాస్(అయినవిల్లి), జిల్లా చైర్మన్, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొని నూతనంగా ఎన్నుకోబడిన అమలాపురం డివిజన్ యూనిట్ ఎపిఆర్ఎస్ సభ్యులను అభినందించారు.

జిఎస్‌టి2.0తో ప్రజలకు మేలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జిఎస్‌టి2.0 సంస్కరణలతో పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు కలుగుతుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం రామచంద్రపురం మండలం వెలంపాలెం గ్రామంలో కూటమి పార్టీ నాయకులతో కలిసి సూపర్ జిఎస్‌టి - సూపర్ సేవింగ్స్‌పై ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రామచంద్రపురం రూరల్ మండలం టిడిపి అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు, టేకుమూడి సత్యనారాయణ, పెంకే సాంబశివరావు, కామేశ్వరరావు, వాసంశెట్టి శ్రీనివాస్, గోవిందు బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్చార్జిలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జిఎస్‌టి 2.0 ప్రకారం ధరలు అమలు చేయాలి

ప్రజాశక్తి - కొత్తపేట

కేంద్ర ప్రభుత్వం సవరించిన జిఎస్‌టి 2.0 ధరలను అమలు చేయాలని మండల టిడిపి నాయకులు కోరారు. కొత్తపేట గ్రామ టిడిపి సమావేశం గ్రామ పార్టీ అధ్యక్షుడు వాసంశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సమావేశంలో గ్రామంలో అభివద్ధి, సంక్షేమ పథకాలు అమలు తదితర అంశాలపై సభ్యులు చర్చించారు.

జనార్ధన స్వామిని దర్శించుకున్న అనుశ్రీ దంపతులు

ప్రజాశక్తి - ఆలమూరు

ఆలమూరులో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీజనార్ధన స్వామి దేవస్థానానికి శనివారం జనసేన రాజమహేంద్రవరం సిటీ ఇంచార్జ్, అనుశ్రీ ఫిలిమ్స్ అధినేత, ఫిలిం డిస్ట్రిబ్యూటర్ అత్తి సత్యనారాయణ (అనుశ్రీ), అనురాధదేవి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ఆలయకమిటీ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు ఆధ్వర్యంలో సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా అనుశ్రీ దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అనుశ్రీ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో నల్లా వెంకన్న, చల్లా బాబి, వెలుగుబంటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బాలబాలాజీ స్వామికి రూ.2.91లక్షల ఆదాయం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ దేవస్థానానికి శనివారం వివిధ విభాగాల ద్వారా రూ. 2,91,233 ఆదాయం సమకూరిందని ఆలయ సహాయకమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. ఇందులో నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.95,541లు ఆదాయం సమకూరిందన్నారు. నాలుగువేల మంది యాత్రికులు స్వామి వారిని దర్శనం చేసుకోగా 2,500 మంది అన్న ప్రసాదం స్వీకరించారు అన్నారు.

చేనేతకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి

కార్మిక శాఖ మంత్రి మంత్రి సుభాష్

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

చేనేతకు పూర్వ వైభవం తీసువచ్చేందుకు కృషి చేస్తానని కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం కపిలేశ్వరపురం మండలం అంగర లో శ్రీ గణపతి చేనేత సహకార సంఘం వద్ద ప్రభుత్వం నుండి రావలసిన సుమారు రూ.4 కోట్ల బకాయిలు విడుదల కోసం గత 14 రోజులు గా చేనేత కార్మికులు చేస్తున్న దీక్షా శిబిరాన్ని మంత్రి సుభాష్, రాష్ట్ర అంచ నాల కమిటీ చైర్మన్ ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వర రావు సందర్శించారు. ఈ నెలాఖరినాటికల్లా చేనేత కార్మికుల బకాయిలు విడుదలకు పరిష్కార మార్గం చూపుతామని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు. కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలను సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్ళి విడుదలయ్యేలా చూస్తానన్నారు. మంత్రి సుభాష్, ఎంఎల్ఎ వేగుళ్ళ ఇచ్చిన హామీ మేరకు దీక్ష విరమించేందుకు చేనేత కార్మికుల అంగీకరించారు. దీంతో వారికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. విజయనగరం జోనల్ ఆర్‌టిసి మాజీ చైర్మన్ నెక్కంటి బాలకృష్ణ, ఛాత్రాతి జానకి రామయ్య, కోన సత్యనారా యణ, నామాల శ్రీనివాస్ తదితరులు చేనేత కార్మికులకు సంఘభావం తెలిపారు. కార్యక్రమంలో అంగర గ్రామ చేనేత సంఘం కార్మికులతో పాటు, వివిధ గ్రామాలకు చెందిన చేనేత కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఫిజికల్ సైన్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా బాబులు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ఎపి ఫిజికల్ సైన్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా జిల్లాకు చెందిన సరేళ్ళ బాబులు ఎంపికయ్యారని జిల్లా సైన్స్ అధికారి, ఎపి ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విఎస్. సుబ్రహ్మణ్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భౌతిక శాస్త్ర బోధనలో తన వినూత్న పద్ధతులతో అనేకమంది విద్యార్థులను ఆకట్టుకుని, విద్యా రంగంలో విశేష సేవలందించిన బాబులు గతంలో సిఎం చంద్రబాబు చేతుల మీదుగా బెస్ట్ సర్వీసెస్ అవార్డు అందుకున్నారనీ అన్నా రు. భౌతిక శాస్త్ర ఉపాధ్యా యుల సమ స్యల పరిష్కారానికి కృషి చేస్తూ, అందరిచే ప్రశంసలు అందుకున్న అమలాపురం వాసి, ఇటీవల విజయవాడలో యుటిఎఫ్ భవనంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు

రుణ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

స్వయం సహాయక సంఘాలు రుణ మేళాను సద్విని చేసుకోవాలని అమలాపురం ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్ అశోక్ నాగరాజు అన్నారు. శనివారం డిఆర్‌డిఎ వెలుగు ఎపిఎం గంగాధర్ ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాలకు రుణ లభ్యత తదితర అంశాలను వివరించారు. ఆత్రేయపురం బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, పాల్గొన్నారు

ఆదిత్యలో పేరెంట్స్ డే

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం కామన గరువు ఆదిత్య స్కూల్లో ఘనంగా గ్రాండ్ పేరెంట్స్‌డేను శనివారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులకు బంధుత్వాలను తెలియ జేసేందుకు గ్రాండ్ పేరెంట్స్ డ ఉపయోగపడుతుందన్నారు. శనివారం గ్రాండ్ పేరెంట్స్ డే దినోత్స వాన్ని పురస్కరించుకొని చిన్నారుల అమ్మమ్మ తాతయ్యలతో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి సుమారు 300 మంది గ్రాండ్ పేరెంట్స్ పాల్గొన్నారు. అనంతరం అమ్మమ్మ తాతయ్య లతో చిన్నారులకు దీవెనలను అందించారు. అమ్మమ్మ, తాతయ్యలను ఎల్లప్పుడూ ప్రేమగా చూసుకుంటామని, వారికి తోడుగా ఉంటామని చిన్నారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జరిగిన క్రీడా పోటీలలో గ్రాండ్ పేరెంట్స్ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతి రెడ్డి, కాలేజీ ప్రిన్సిపల్ చలపతిరావు, స్కూల్ ప్రిన్సిపల్ రామప్రసాద్, అభినందించారు.